సాక్షి పెద్దపల్లి

మంగళవారం ౹ 14 ౹ మార్చి ౹ 2023



బూడిద ఉచితంగా ఇవ్వండి

ఎన్టీపీసీ రామగుండం సంస్థ నుంచి వెలువడే బూడిదను బ్రిక్స్ ఇండస్ట్రీలకు ఉచితంగా ఇవ్వాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్రిక్స్ ఇండస్ట్రీ యజమానులు డిమాండ్ చేశారు. 8లో▸



గుడిసెలు కనిపించడం లేదా..?

గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదలు చాలామంది ఉన్నారని, వారి గుడిసెలు పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి కనిపించడం లేదా అని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు ప్రశ్నించారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
36.0/20.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న మమతారెడ్డి

పెద్దపల్లిరూరల్: మహిళల రక్షణకు ప్రభుత్వం అనేక చట్టాలు తెచ్చిందని, వాటిపై అవగాహన పెంచుకోవాలని పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలో సోమవారం నిర్వహించిన మహిళాదినోత్సవ వారోత్సవాల కార్యక్రమంలో మాట్లాడారు. వేధింపులకు గురయ్యే మహిళలు టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం అందిస్తే సత్వర సాయం అందుతుందన్నారు. బాల్య వివాహాలతో అనేక అనర్థాలు కలుగుతాయన్నారు. బాల్య వివాహాలు చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశముందన్నారు. సమావేశంలో వైస్‌చైర్మన్ నాజ్మిన్‌సుల్తానా, కౌన్సిలర్లు పెద్ది గీతాంజలి, గాదె మాధవి, పైడ పద్మ, దేవనంది రమాదేవి, కమిషనర్ శ్రీనివాసరెడ్డి, మేనేజర్ కట్ట శివప్రసాద్, మెప్మా రిసోర్స్ పర్సన్ తదితరులున్నారు.

ఈఎస్‌ఐ ఆసుపత్రి త్వరగా ఏర్పాటు చేయాలి



మంత్రి మల్లారెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: కార్మికులకు నిలయమైన రామగుండం నియోజకవర్గంలో ఈఎస్‌ఐ ఆసుపత్రిని త్వరగా ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే కోరుకంటి చందర్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డిని కోరారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి పలు సమస్యలపై మాట్లాడారు. ఈఎస్‌ఐ ఆసుపత్రి త్వరగా ఏర్పాటు చేస్తే కార్మికులకు వైద్యపరంగా ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ ఐటీఐలో మరిన్ని కోర్సులు చేర్చాలని, తద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. విజయమ్మ ఫౌండేషన్ ద్వారా 90 కుట్టుమిషన్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఐదు వేలమందికి ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చామని, వారందరికీ మిషన్లు అందించాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని చందర్ తెలిపారు.

రష్మీఠాగూర్‌కు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న రష్మీ ఠాగూర్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాతానికి చెందిన రష్మీ ఠాగూర్ అంతర్జాతీయ మహిళా పురస్కారాన్ని అందుకుంది. హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్ ఆడిటోరియంలో స్త్రీ హస్తినా మహిళా మండలి ఆధ్వర్యంలో డాక్టర్ పూర్ణా శాంతి గుప్తాలు సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ఈ పురస్కారాన్ని అందుకున్నారు. రష్మీకి మహిళా పురస్కారం రావడంపై స్థానిక మహిళలు అభినందించారు.

సంచార ప్రయోగశాలలు.. సృజనాత్మకత కేంద్రాలు



కేజీబీవీల్లో సంచార విజ్ఞాన ప్రయోగశాలలు

రామగుండం: సంచార ప్రయోగశాలలతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు అన్నారు. అంతర్గాం మండలంలోని రామగుండం, అంతర్గాం కస్తూర్బా విద్యాలయాల్లో సంచార ప్రయోగశాలలో గుణాత్మక విద్య అందించారు. ఆరు నుంచి పదో తరగతి పాఠ్య పుస్తకాల్లోని కఠిన అంశాలను కృత్యాధార బోధన ద్వారా అర్థమయ్యేలా వివరిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 122 పాఠశాలలకు ఇప్పటికే 119 పాఠశాలల్లో సంచార విజ్ఞాన ప్రయోగశాలలను అమలు చేశామన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారులు వి.కవిత, పి.కల్పన, రిసోర్స్ పర్సన్స్ జి.అంజన్‌కుమార్, జె.రవీందర్, ఎం.భూంరావు, పిట్టల హరిప్రసాద్, రవూఫ్, వి.సుజాత, పి.శ్రీధర్, అంతయ్య, సీఆర్‌టీలు కవిత, కళ్యాణి, మల్లేశ్వరీ, ప్రత్యూష తదితరులున్నారు.

కాలిపోతే కష్టాలే..!

ఎండలతో పెరుగుతున్న విద్యుత్ వినియోగం



జిల్లాకేంద్రంలోని రిపేరింగ్ సెంటర్‌లో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు

- కాలుతున్న ట్రాన్స్‌ఫార్మర్‌లు
- రైతు నెత్తిన రవాణా ఖర్చులు
- కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల కోసం 273మంది నిరీక్షణ

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో యాసంగిలో పంటల సాగుతోపాటు విద్యుత్ వినియోగం పెరగడంతో ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక లోడ్ పడి కాలిపోతున్నాయి. మార్చి ప్రారంభంలోనే ఎండలు మండుతుండటంతో వ్యవసాయానికి కరెంట్ వాడకం అమాంతం పెరిగింది. లోడ్ పెరగడం, లోఓల్టేజీ సమస్యతో జిల్లావ్యాప్తంగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. వాటి స్థానంలో కొత్తవి బిగించాలంటే వారం నుంచి పది రోజులు పడుతోంది. అప్పటివరకు నీరందక పంట పొలాలు ఎండిపోతున్నాయి. ఇలా జిల్లావ్యాప్తంగా 398 ట్రాన్స్‌ఫార్మర్లు భగ్గుమన్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులే మరమ్మతు చేయించుకోవాల్సి వస్తోంది. రిపేరింగ్ సెంటర్ దూరాన్ని బట్టి, ఇతరత్రా ఖర్చులను కలుపుకొని రూ.2వేల నుంచి రూ.ఐదు వేల వరకు రైతులందరూ కలిసి భరిస్తున్నారు.

లోవోల్టేజీ, ఓవర్ లోడ్‌తోనే..

జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్‌లు తరుచూ కాలిపోవడానికి లోవోల్టేజీ, ఓవర్ లోడ్ కారణంగా భావిస్తున్నారు. మరమ్మతు లోపంతోనూ కాలిపోతున్నాయని రైతులు అంటున్నారు. జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్లు బాగుచేసేందుకు విద్యుత్తుశాఖ పరిధిలో ఏడు కేంద్రాలున్నాయి. పెద్దపల్లిలో రెండు, శ్రీరాంపూర్, మంథని, గోదావరిఖని, ధర్మారం, సుల్తానాబాద్‌లో మరమ్మతు కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో మూడు నెలల్లో 398 ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు చేశారు.

నిబంధనలు ఇలా...

వ్యవసాయానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే రైతులు మండల ఏఈకి సమాచారమిస్తే దాని స్థానంలో 48 గంటల్లో మరొకటి ఏర్పాటు చేసి విద్యుత్తును పునరుద్ధరించాల్సి ఉంటుంది. విద్యుత్తు శాఖ వాహనంలో సిబ్బందితో తరలించడం.. తీసుకురావడం, బిగించడం చేయాల్సి ఉంటుంది. అయితే సకాలంలో సిబ్బంది రాకపోవడం, డిపార్ట్‌మెంట్ వాహనం అందుబాటులో లేకపోవడంతో రైతులు తలాకొన్ని డబ్బులు వేసుకొని, వాహనం అద్దెకు తీసుకొని తీసుకొస్తున్నారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఎదురుచూపులు..

విద్యుత్తు సరఫరాలో ట్రాన్స్‌ఫార్మర్లదే కీలక పాత్ర. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కావాలని రైతు డీడీ తీసిన దగ్గరి నుంచి పొలంలో ఏర్పాటు చేసేందుకు ఏళ్లు పడుతోంది. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌పై ఓవర్‌లోడ్ పడి ట్రిప్ అవుతున్నాయని రైతులు వాపోతున్నారు. మరోవైపు ట్రాన్స్‌ఫార్మర్లతోపాటు లోఓల్టేజీ కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోతుండటంతో అన్నదాతల అగచాట్లు వర్ణనాతీతంగా ఉన్నాయి. జిల్లాలో 16,628 ట్రాన్స్‌ఫార్మర్లుండగా.. కొత్తవాటికోసం 273 మంది దరఖాస్తు చేసుకుని నిరీక్షిస్తున్నారు.

> **ఇబ్బంది లేకుండా చూస్తున్నాం**
>
> ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిన వాటిని రిపేరింగ్ పూర్తి చేసి వెంటనే ఇచ్చేలా ఏర్పాట్లు చేశాం. అత్యవసరానికి తాత్కాలికంగా ఇవ్వడానికి అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లను కూడా రిపేరింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచాం. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులెదురైనా రైతులు తమ దృష్టికి రావాలి. రిపేరింగ్ కేంద్రాల్లో ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే ఫిర్యాదు చర్యలు తీసుకుంటాం.
>
> – సుదర్శన్, ఎస్‌ఈ, పెద్దపల్లి



జిల్లాలో వరిసాగు విస్తీర్ణం గణనీయంగా పెరగడంతో విద్యుత్ వినియోగమూ అదేస్థాయిలో నమోదవుతోంది. బోర్ల నుంచి రైతులు నిత్యం నీటిని తోడుతుండడంతో ఆ ప్రభావం ట్రాన్స్‌ఫార్మర్లపై పడి మొరాయిస్తున్నాయి. ఒకవేళ అవి కాలిపోతే వాటిని మరమ్మతు కేంద్రాలకు తరలించి వెంటనే మరొకటి తీసుకెళ్లి అమర్చుకోవాలి. కానీ క్షేత్రస్థాయిలో అలా జరగటం లేదు. దించడం మొదలు.. కేంద్రానికి తీసుకెళ్లి మళ్లీ వ్యవసాయ క్షేత్రంలో బిగించేవరకూ అష్టకష్టాలు పడుతున్నారు. దీనికంతటికీ ఖర్చులను రైతులే భరిస్తున్నారు.

వామ్మో కుక్కలు.. కోతులు..!



ఓదెల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బాధితులు

- కుక్కల దాడిలో ఏడుగురికి గాయాలు
- కోతుల దాడిలో ఇద్దరికి గాయాలు
- ప్రభుత్వ కార్యాలయాల ముందు కర్రలతో కాపలా

ఓదెల: ఓదెల మండలంలో కుక్కలు, కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. వాటి దాడులతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇళ్లతోపాటు ప్రభుత్వ కార్యాలయాల వద్ద కాపలా కాయాల్సిన దుస్థితి నెలకొంది. సోమవారం మండలకేంద్రంతోపాటు ఓదెల, కొమిర గ్రామంలో కుక్కలు రెచ్చిపోయాయి. మండలకేంద్రంలో మినుగు కొంరయ్య, సాత్తూరి మహేశ్, కొట్టె భవాని, కొమిరలో నూనె శంకరయ్య, మొండయ్య, శ్రీనివాస్, రమేశ్, నాగమ్మ తీవ్రంగా గాయపడ్డారు. ఓదెలలో ఆరుబయట ఆడుకుంటున్న కినికిరెడ్డి నివాసిని(3)పై కుక్కలు మూకుమ్మడిగా దాడి చేయడంతో ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. చిన్నారి పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌కు తరలించారు. పొత్కపల్లి గ్రామంలో కోతులు దాడిచేయటంతో వేపూరి సరోజన, మధురమ్మ గాయపడ్డారు. వారిని స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ పరిణామాలతో దారి వెంట నడవాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. పిల్లలైతే కుక్కలను చూస్తూ అరచేతిలో ప్రాణాలను పెట్టుకుని వెళ్తున్నారు.



ప్రభుత్వ కార్యాలయాల ముందు కాపలా

ఓదెలలో కుక్కలు మూకుమ్మడిగా దాడిచేసి పలువురిని తీవ్రంగా గాయపరచడంతో ఓదెల తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల ముందు వాచ్‌మన్, అటెండర్‌లు కర్రలతో కాపలా కాస్తున్నారు. కార్యాలయాలకు వచ్చిపోయేవారంతా చేతిలో కర్రలను పట్టుకుని వెళ్తున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పట్టించుకోని పంచాయతీ సిబ్బంది

మండలవ్యాప్తంగా ప్రజలపై కుక్కలు, కోతులు దాడి చేస్తున్నా.. బాధితులు ఆసుపత్రుల పాలవుతున్నా గ్రామ పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఏ గ్రామానికి వెళ్లినా రోడ్లవెంట కుక్కలు గుంపులుగుంపులుగా దర్శనమిస్తున్నాయి. పిచ్చికుక్కలు స్వైరవిహారం చేస్తునాన.. అధికారులు పట్టించుకోకపోవటంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

కటికెనపల్లికి సబ్‌స్టేషన్ మంజూరు చేయండి

ధర్మారం: మండలంలోని కటికెనపల్లి గ్రామానికి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని మాజీమంత్రి, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి ఎన్‌పీడీసీఎల్ చైర్మన్ అండ్ ఎండీ గోపాల్‌రావును కోరారు. ఈ మేరకు ఆయన ఓ లేఖ పంపించారు. బంజేరుపల్లికి మంజూరైన విద్యుత్ సబ్‌స్టేషన్‌కు స్థలం లేనికారణంగా రద్దుచేసినట్లు సమాచారం ఉందని, ఆ సబ్‌స్టేషన్‌ను కటికెనపల్లికి మార్చాలని కోరారు. అలా చేస్తే కటికనపల్లి, బంజేరుపల్లితోపాటు సమీప గ్రామాలకు లోవోల్టేజీ సమస్య తీరుతుందని పేర్కొన్నారు. సబ్‌స్టేషన్‌కు సరిపడా స్థలం సర్వే నంబర్ 1255లో ఉందని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని పలు గ్రామాల నుంచి వచ్చి ప్రజలు అందించే సమస్యలను విని వాటిని పరిష్కరించేందుకే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ సంగీత అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ సంగీత, అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీనారాయణ, కుమార్‌దీపక్‌లు 38 దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులపై సత్వరమే పరిష్కారం చూపాలని అన్ని శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పెద్దపల్లి మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన మాదాసు విజయ ప్రభుత్వం తనకు సర్వే నెంబరు 22లో కేటాయించిన ఎకరం భూమి వివరాలను ధరణిలో నమోదు చేయించి పట్టాదార్ పాసుపుస్తకం ఇప్పించాలని వేడుకున్నారు. ప్రజావాణిలో జిల్లా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్‌కార్డు ఇప్పించండి...

రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు ఇవ్వడం లేదు. ఉపాధి కోసం అప్పుచేసి లారీ కొనుక్కొని స్వయంగా నడుపుకుంటున్న. వాహనం ఉందన్న కారణంగా రేషన్ కార్డు ఇవ్వడం లేదు. పుట్టుకతో దివ్యాంగురాలైన కూతురుకు వైద్యం చేయించుకునే స్థోమత లేక ఇబ్బంది పడుతున్న. తెల్ల రేషన్‌కార్డు ఇప్పించి ఆదుకోవాలి.

– పురం రాములు, కళావతి, గోదావరిఖని

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం

రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా గతేడాది ఎలిగేడు మండలం ర్యాకల్‌దేవ్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు అవకాశమిచ్చారు. ఈసారి కూడా మేం ధాన్యం కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. కొనుగోలు కేంద్రాన్ని మా సంస్థకు కేటాయించాలి.

–మొగిళి, సుధాకర్ రైతు ఉత్పత్తిదారుల సంస్థ ప్రతినిధులు

గుర్తింపు ఎన్నికల కాలపరిమితి రెండేళ్లు..!?

- మెజార్టీ కార్మిక సంఘాల పట్టు
- తెరపైకి రెండు ఓట్ల విధానం
- రెండు నెలలు గడువు కోరిన యాజమాన్యం
- వెంటనే నిర్వహించాలన్న డీవైసీఎల్‌సీ
- వచ్చేనెల 2న తిరిగి సమావేశం

గోదావరిఖని: సింగరేణిలో గుర్తింపు ఎన్నికలు రెండేళ్లు ఉండాలని, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం కోసం రెండు ఓట్ల విధానం, కాంట్రాక్టు కార్మికులకు ఓటుహక్కు అంశాలపై సోమవారం హైదరాబాద్‌లోని సీఎల్‌సీ కార్యాలయంలో జరిగిన కార్మిక సంఘాల సమావేశం వాడీవేడిగా సాగింది. సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో కార్మిక సంఘాలు, సింగరేణి యాజమాన్యంతో డిప్యూటీ సీఎల్‌సీ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గుర్తింపు ఎన్నికల కాలపరిమితి రెండేళ్లపాటు ఉండాలని పలు సంఘాలు కోరాయి. దీనికి దాదాపు అంగీకరించినట్లు తెలుస్తోంది. అయితే కొన్ని సంఘాలు వ్యతిరేకించాయి. అలాగే గుర్తింపు యూనియన్ కోసం ఒక ఓటు, ప్రాతినిధ్య సంఘం కోసం మరో ఓటు ఇలా రెండు ఓట్ల విధానం ఉండాలని పలు సంఘాలు డిమాండ్ చేశాయి. దీనిపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి తేల్చలేదు. పాత పద్ధతినే కొనసాగించాలని నిర్ణయించారు. అలాగే సాధ్యమైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలనే అంశంపై అన్ని కార్మిక సంఘాల అభిప్రాయాలు తెలుసుకున్నారు.

రెండునెలల గడువు కోరిన సింగరేణి

సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల కోసం యాజమాన్యం రెండు నెలల గడువు కోరింది. ఏప్రిల్, మే నెలల్లో సింగరేణి ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి అధికంగా ఉంటుందని, ఈ క్రమంలో ఎన్నికలు నిర్వహిస్తే ఉత్పత్తిపై తీవ్రప్రభావం చూపుతుందని వివరించింది. దీనిపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి విభేదించినట్లు తెలుస్తోంది. కోర్టు ఆదేశాలున్న క్రమంలో సాధ్యమైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని సూచించినట్లు సమాచారం.

కాంట్రాక్టు కార్మికులకూ ఓటు హక్కు?

సింగరేణిలోని కాంట్రాక్టు కార్మికులకూ ఓటు హక్కు కల్పించాలని కార్మిక సంఘాలు కోరాయి. దీనికి మరికొన్ని వ్యతిరేకించాయి. పర్మినెంట్ కార్మికులకే ఓటు హక్కు కల్పించాలని, గతంలో ఉన్నవిధంగా ముందుకెళ్లాలని అభిప్రాయపడ్డాయి.



సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాలు

ఏప్రిల్ 2న ఎన్నికల షెడ్యూల్..

వచ్చేనెల 2న తిరిగి సమావేశం నిర్వహించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ నిర్ణయించారు. అదేరోజు ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత 45 రోజులకు ఎన్నికలు జరగనున్నట్లు భావిస్తున్నారు.

గడువుదాటితే అన్ని కార్మిక సంఘాలూ సమానమే..

గడువు ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని, దాటితే ఎన్నికలు నిర్వహించేవరకూ అన్ని కార్మిక సంఘాలను చర్చలకు ఆహ్వానించాలని డిమాండ్ చేశాయి. దీనిపై అన్ని సంఘాలు అంగీకరించినట్లు సమాచారం. టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావు, మిర్యాల రాజిరెడ్డి, నాయకులు సీతారామయ్య, శేషయ్య, నర్సింహారావు, రాజారెడ్డి, రియాజ్ అహ్మద్, జనక్ ప్రసాద్, నర్సింహారెడ్డి, యాదగిరి సత్తయ్య, పులి రాజిరెడ్డి, క్రాఫ్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

టెండర్లు వేయం.. వేయనియ్యం..!

- రోడ్ల మరమ్మతుల్లో కొన్నిచోట్ల కాంట్రాక్టర్ల చేతివాటం
- అధిక ధరలకు టెండర్లు దక్కించుకునేందుకు వ్యూహం
- 210 టెండర్లలో ఒక్కటీ ఆమోదం పొందని వైనం
- పంచాయతీరాజ్ శాఖలో కొందరు అధికారుల సహకారం..?
- ఉమ్మడి జిల్లాలో 506 కి.మీ రోడ్లకు రూ.192 కోట్ల అంచనాతో పనులు



సుల్తానాబాద్ పట్టణంలో పూసాల వెళ్లే మార్గంలో గుంతలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రోడ్ల మరమ్మతుల్లో కొందరు కాంట్రాక్టర్లు చక్రం తిప్పడానికి సిద్ధమయ్యారని సమాచారం. ఇటీవల వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో రోడ్లు దారుణంగా దెబ్బతిన్నాయి. ఈక్రమంలో ప్రభుత్వం వీటి మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగానే కొత్త జిల్లాల వారీగా ధ్వంసమైన రోడ్లకు అంచనాలు రూపొందించారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే.. ఆయా పనులకు టెండర్లు పిలిచారు. చాలా ప్రాంతాల నుంచి కాంట్రాక్టర్ల నుంచి స్పందన బాగానే ఉంది. కొన్ని ప్రాంతాల్లో మాత్రం పనులు చేసేందుకు టెండర్లు పిలిచినా.. కాంట్రాక్టర్ల నుంచి స్పందన కరువవడం గమనార్హం. మరమ్మతు పనుల్లో అధిక లాభాలు గడించేందుకు టెండర్లు వేయం.. వేయనీయం అన్నట్లుగా కాంట్రాక్టర్లు వ్యవహరిస్తుండడం గమనార్హం.

రింగైన కాంట్రాక్టర్లు..?

రాష్ట్రవ్యాప్తంగా వరదలు, వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు సంబంధించిన దుస్థితిపై 'సాక్షి' ప్రధాన పత్రికలో 'రోడ్లకు రోగం' పేరిట సమగ్ర కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే సమీక్ష జరిపారు. రోడ్ల మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని ఆ సమావేశంలో ఆదేశించారు. అందులో భాగంగా కరీంనగర్ రీజియన్‌లో ఉన్న కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలకు సంబంధించి దాదాపు రూ.192.44 కోట్ల అంచనాతో మొత్తంగా 506.39 కి.మీల మేర ధ్వంసమైన రోడ్లకు అధికారులు టెండర్లు పిలిచారు. ఇందులో ఉమ్మడి జిల్లా మొత్తం కలిపి ఫిబ్రవరి చివరినాటికి 210 టెండర్లు వచ్చాయి. అందులో నుంచి 168 టెండర్లను చీఫ్ ఇంజినీర్‌కు సమర్పించారు.

రీజియన్	మొత్తం	బీటీఆర్	ఎఫ్‌డీఆర్	బీటీ కి.మీ	అంచనా వ్యయం రూ.కోట్లల్లో	టెండర్ రిసీవ్డ్	టెండర్ సబ్మిటెడ్
కరీంనగర్	80	24	56	209.23	96.62	77	51
జగిత్యాల	94	28	66	173.81	58.59	94	83
పెద్దపల్లి	15	15	00	36.35	11.59	15	15
రాజన్నసిరిసిల్ల	27	19	08	87.00	25.64	24	19
మొత్తం	216	86	130	506.39	192.44	210	168

(బీటీఆర్ = బ్లాక్ తార్ రోడ్డు, ఎఫ్‌డీఆర్= ఫ్లడ్ డ్యామేజ్ రోడ్డు)
నోట్: ఫిబ్రవరి చివరి నాటికి మరమ్మతుకు సంబంధించి టెండర్ల పురోగతి

ఒక్క టెండరూ ఆమోదం పొందలేదా?

కరీంనగర్ రీజియన్ పరిధిలో మొత్తం వచ్చిన టెండర్లలో 210లో కేవలం 168 టెండర్లు మాత్రం చీఫ్ ఇంజినీర్‌కు వెళ్లాయి. ఇప్పటివరకూ వీటిలో ఒక్క పని కూడా ఆమోదం పొందలేదు. మరోవైపు 2022–23 ఆర్థిక సంవత్సరం నెలాఖరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఒక్క పని కూడా ఆమోదం పొందకపోవడంలో ఆంతర్యం ఏంటన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పనుల ఆమోదంలో జాప్యం వల్ల.. అధిక అంచనాలకు టెండర్లు దాఖలు చేసే కాంట్రాక్టర్లకే లబ్ధి చేకూరుస్తుందని తెలిసినా టెండర్లలో పురోగతి లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయంలో అధికారుల తీరుపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

➜ మరికొన్ని చోట్ల రెండుసార్లు టెండర్లు పిలిచినా ఇంతవరకూ కాంట్రాక్టర్ల నుంచి స్పందన కరువైంది. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్లంతా ముందే రింగయ్యారని, అందుకే కొన్ని చోట్ల టెండర్లు వేసినా ఎలాంటి స్పందన రావడం లేదని పంచాయతీరాజ్ సిబ్బందే వ్యాఖ్యానిస్తున్నారు. మూడోసారి టెండరు పిలిచినప్పుడు ఉన్న ధరకంటే అధికంగా కోట్ చేసినా గత్యంతరం లేక ఆమోదింపజేసుకునేందుకు కాంట్రాక్టర్లు వేసిన ఎత్తుగడగా అభివర్ణిస్తున్నారు. ఇందుకు పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది కూడా సహకరిస్తున్నారని ప్రచారం సాగుతోంది.

క్లుప్తంగా

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు, టీచర్లు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): వేములవాడ పట్టణంలో ఇటీవల నిర్వహించిన 31వ స్టేట్ ఓపెన్ కరాటే పోటీల్లో కాల్వశ్రీరాంపూర్ మండలంలోని వెన్నంపల్లి విద్యార్థులు ప్రతిభ కనబరిచారని హెచ్ఎం లింగయ్య తెలిపారు. కె.పావని, ఇ.సాన్విత, ఎస్.శృతి, పి.అశ్రిత, కె.అవంతికలు బంగారు, సీహెచ్.హరీశ్, సీహెచ్.నిత్యతేజశ్రీ, ఇ.శ్రీహర్షిణి, ఇ.శ్రీనిత, ఆర్.సాయిప్రసన్న వెండి, జి.గంగాభవాని, యు.సాహితి, సీహెచ్.వైష్ణవి, జె.అన్విశ్రీ, టి.నిదర్శిణి, వి.నిహారిక, వి.రష్విత, బి.సహ స్రవర్ధిణి, కె.షాలిని కాంస్య పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు వంగళ తిరుపతి రెడ్డి, ఎంఈవో రాజయ్య, సర్పంచు శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు దేవేందర్, ఎస్ఎంసీ చైర్మన్ రమేశ్, పీఈటీ ప్రసాద్, నాయకులు శ్రీనివాస్, మధుకర్, నాగభూషణం, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ప్రదానం


నారాయణకు అవార్డు ఇస్తున్న నిర్వాహకులు

రామగిరి(మంథని): మండలంలోని లద్నాపూర్‌కు చెందిన తాళ్లపల్లి నారాయణకు హైదరాబాద్‌కు చెందిన బహుజన సాహిత్య అకాడమీ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ నేషనల్ అవార్డు–2023 అందించింది. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో సోమవారం నిర్వహించిన బహుజన రైటర్స్ 6వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్ సందర్భంగా అవార్డు సెలక్షన్ కమిటీ నేషనల్ చైర్మన్ నల్లా రాధాకృష్ణ చేతులమీదుగా పురస్కారం అందజేశారు. శాలువాతో సత్కరించి, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎం. గౌతమ్, రాష్ట్ర కో–ఆర్డినేటర్ హనుమాండ్ల విష్ణు, సెలక్షన్ కమిటీ సభ్యుడు పానుగంటి రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

సమాధులు తొలగించడాన్ని నిరసిస్తూ దీక్ష



దీక్ష చేస్తున్న మృతుల బంధువులు

ధర్మారం(ధర్మపురి): మండలంలోని దొంగతుర్తి శివారు రచ్చపల్లి క్రాస్‌రోడ్డు వద్ద తమ వారి సమాధులను తొలగించారని మృతుల బంధువులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం రిలే దీక్ష చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. దొంగతుర్తి గ్రామానికి చెందిన మాజీ మిలిటెంట్ భూపెల్లి ఎల్లయ్య 20 ఏళ్ల క్రితం మృతిచెందాడు. మృతదేహాన్ని ఇదే గ్రామానికి చెందిన మల్లేశం పట్టా భూమిలో దహనం చేశారు. తర్వాత అక్కడే సమాధి నిర్మించారు. తర్వాత ఎల్లయ్య తల్లిదండ్రులు మూడేళ్ల వ్యవధిలోనే చనిపోగా ఇదే స్థలంలో దహనం చేసి, సమాధులు కట్టించారు. అయితే సదరు పట్టాదారుడు భూమిని చదును చేసి, సమాధులు తొలగించాడు. దీంతో ఎల్లయ్య సోదరి సూర శాంత, రాములుతోపాటు మరొకరు ఇక్కడే సమాధులు తిరిగి నిర్మించాలని డిమాండ్ చేస్తూ దీక్ష చేపట్టారు. ఈ విషయమై గతంలోనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని శాంత తెలిపింది.

ఎన్టీపీసీ బూడిద ఉచితంగా ఇవ్వండి

- టెండర్ విధానంలో కేటాయిస్తే రోడ్డున పడతాం
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్రిక్స్ ఇండస్ట్రీస్ యజమానుల ఆవేదన


అధికారులకు వినతిపత్రం ఇస్తున్న బ్రిక్స్ ఇండస్ట్రీస్ యజమానులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం సంస్థ నుంచి వెలువడే బూడిదను బ్రిక్స్ ఇండస్ట్రీలకు ఉచితంగా ఇవ్వాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్రిక్స్ ఇండస్ట్రీ యజమానులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రాజెక్టు పరిపాలనా భవనం రోడ్‌లో కుందనపల్లి మాజీ సర్పంచు మేకల సరస్వతి–మైసయ్యల ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లి, జగిత్యాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు చెందిన బ్రిక్స్ యజమానులు నిరసన తెలిపారు. పదేళ్లుగా ఎన్టీపీసీ సంస్థ ఫ్లైయాష్‌ను ఉచితంగా అందిస్తోందన్నారు. ఒక లారీ బూడిదను రూ.1,000 నుంచి రూ.1,500కు పొందేవారమని తెలిపారు. నేడు ఆన్‌లైన్ చేసి, టెండర్ విధానం ద్వారా పొందాలంటే రూ.8,000 చెల్లించాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమన్నారు. బ్రిక్స్ ఇండస్ట్రీ నిర్వాహకులు ఇటుకబట్టీలను నడపలేక రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. యాష్ పాండ్‌లో బూడిద నిల్వలు పేరుకుపోయాయని, కుందనపల్లి, అక్బర్‌నగర్‌లలో చిన్న గాలి వచ్చినా బూడిద స్థానికంగా ఉన్న కాలనీలను కమ్మేస్తోందని తెలిపారు. ఈ నెలలో ఎన్టీపీసీ యాజమాన్యం టెండర్ పిలవనున్న నేపథ్యంలో టెండర్ ప్రకారం కాకుండా గతంలో మాదిరిగా బ్రిక్స్ ప్లాంట్లకు ఉచితంగా అందించేలా ఉత్తర్వులివ్వాలని డిమాండ్ చేశారు. డిమాండ్ లేని సమయంలో ఎన్టీపీసీ బూడిదను వినియోగించాలని, బ్రిక్స్ ఇండస్ట్రీలకు ఉచితంగా ఇస్తామని ముందుకు వచ్చారని గుర్తుచేశారు. ఆయా పరిశ్రమలకు ప్రోత్సాహం సైతం అందించారని పేర్కొన్నారు. కానీ ఇప్పుడు టెండర్ విధానంలో బూడిదను విక్రయించడంతో బూడిదతో ఇటుకలు తయారు చేసే పరిశ్రమలు నష్టాల్లోకి వెళ్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. సంస్థ యాజమాన్యం మానవతా దృక్పథంతో గతంలో మాదిరిగా ప్రభావిత, పునరావాస ప్రాంతాలతోపాటు ఉమ్మడి జిల్లాలోని బ్రిక్స్ ఇండస్ట్రీలకు ఉచితంగా అందించాలని, టెండర్ విధానాన్ని రద్దు చేయాలని విన్నవించారు. అనంతరం ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఉన్నతాధికారులకు వినతిపత్రం అందించారు. బ్రిక్స్ ఇండస్ట్రీస్ యజమానులు హరిశ్చంద్రప్రసాద్, వెంకటేశ్వర్లు, శ్రవణ్, కొంరయ్య, ప్రసాద్, తిరుపతి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పేదల గుడిసెలు కనిపించడం లేదా..?

- మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు: గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదలు చాలామంది ఉన్నారని, వారి గుడిసెలు పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి కనిపించడం లేదా అని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రశ్నించారు. గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ.. పల్లె ల్లెకూ విజ్ఞన్న కార్యక్రమంలో భాగంగా మండలంలోని ర్యాకల్‌దేవుపల్లిలో 9వరోజు పాదయాత్ర చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. చాలామందికి పూరి గుడిసెలే ఉన్నాయని, వారందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మడ్లపల్లి అంజయ్య, నాయకులు దుగ్యాల సంతోష్‌రావు, గోపు లక్ష్మీకాంతరెడ్డి, కాసర్ల రాంరెడ్డి, అమ్ముల రాయమల్లు, నలిగేటి సతీశ్, కోడూరి రమేశ్, మహేందర్, సంజీవరెడ్డి, కొమురయ్య పాల్గొన్నారు.


జూలపల్లిలో పర్యటిస్తున్న విజయరమణారావు

నాగులపల్లిలో..

జూలపల్లి: మండలంలోని నాగులపల్లిలో సోమవారం రాత్రి విజయరమణారావు ఆధ్వర్యంలో హాథ్‌సేహాథ్ జోడోయాత్ర చేపట్టారు. రాష్ట్రప్రభుత్వం నిత్యావసరాల ధరలు, విద్యుత్, బస్‌చార్జీలను పెంచి పేద, మధ్యతరగతి వర్గాలపై పెనుభారం మోపిందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు కందుకూరి అంజయ్య, గోస్కుల రామచంద్రం, కట్ల సాయి, అమిరిశెట్టి రాజిరెడ్డి, కొంపల్లి స్వామి, బొట్ల వెంకటేశ్, బొజ్జ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు సజావుగా నిర్వహించాలి

పెద్దపల్లిరూరల్: ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖమంత్రి సబితాఇంద్రారెడ్డి జిల్లా కలెక్టర్లు, అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్, కార్యదర్శి వాకాటి కరుణతో కలిసి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా కలెక్టర్లు పర్యవేక్షించాలని, టోల్‌ఫ్రీ నంబరు 14416కు కాల్‌చేస్తే మానసిక నిపుణులు ఉచిత కౌన్సెలింగ్ నిర్వహిస్తారని వివరించారు. 040–24601010కు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు.

జిల్లాలో 25 పరీక్షా కేంద్రాలు

జిల్లాలో ఇంటర్ పరీక్షలకు 11,952 మంది హాజరవుతున్నారని, 25 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లు మూసిఉంచాలని, 144 సెక్షన్ అమలులో ఉంటుందని వివరించారు. జిల్లా విద్యార్థులకోసం హెల్ప్‌లైన్ నంబరు 9440850216 ఏర్పాటు చేశామన్నారు. ఇంటర్ అధికారి కల్పన, ఏసీపీ మహేశ్, మంథని ఆర్డీఓ వీరబ్రహ్మాచారి, డీఎంహెచ్ఓ ప్రమోద్‌కుమార్, డీపీవో చంద్రమౌళి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి తదితరులున్నారు.

వరకట్న వేధింపులకు వివాహిత బలి

- ఈ నెల 12న ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి


సరిత (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): మండలంలోని కొత్తపల్లికి చెందిన అజ్మీరా సరిత(29) అత్తింటి వేధింపులు భరించలేక ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. సరితకు కొత్తపల్లికే చెందిన అజ్మీరా స్వామినాయక్‌తో పదేళ్ల క్రితం పెళ్లి జరిగింది. వివాహ సమయంలో ఒప్పుకున్న కట్నకానుకలు ముట్టజెప్పారు. ఈ దంపతులకు కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కానీ అత్తంటివారు అదనపు వరకట్నం కోసం తరచూ వేధిస్తుండటంతో సరిత మనోవేదనకు గురైంది. ఈ క్రమంలో ఆదివారం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతిచెందింది. భర్త స్వామినాయక్‌తోపాటు అత్తామామ అజ్మీరా గంగమ్మ, జగ్మాల్‌నాయక్, ధర్మారం మండలంలోని బంజేరుపల్లి తండాకు చెందిన ఆడపడుచులు భూక్య రాజమ్మ, భూక్య శ్రీలత, భూక్య కవితలు వేధింపులకు గురిచేయడం వల్లే సరిత ఆత్మహత్య చేసుకుందని మృతురాలి సోదరి బదావత్ మహేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేశోరాంలో ఎన్నికల నిర్వహణపై సమావేశం

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో పర్మినెంట్ కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణపై కంపెనీ హెచ్ఆర్ అధికారులు సోమవారం సమావేశం నిర్వహించారు. పర్మినెంట్ కార్మిక సంఘం పదవీకాలం ముగిసి, రెండు నెలలు గడిచిన నేపథ్యంలో ఇటీవల బీఆర్ఎస్ నాయకులు ఉన్నతాధికారులను కలిసి, ఎన్నికలు నిర్వహించాలని కోరారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కంపెనీ హెచ్ఆర్ అధికారులు ఎన్నికల బరిలో నిలిచే ఔత్సాహికులతో సమావేశమయ్యారు. ఈ నెల 18, 20, 23 తేదీల్లో ఎన్నికలు జరిపేందుకు ఇరు వర్గాలు సూత్రప్రాయంగా అంగీకారానికి వచ్చాయి. ఎన్నికలు జరిపే తేదీని కంపెనీ అధికారులు మంగళవారం అధికారికంగా ప్రకటించనున్నట్లు తెలిసింది.

కాంట్రాక్ట్ విద్యుత్ ఉద్యోగికి తీవ్ర గాయాలు

రామగిరి(మంథని): తెగిపోయిన విద్యుత్ లైన్‌కు మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు మరో విద్యుత్ వైరు తగిలి విద్యుత్‌దాఘాతంతో ఓ కాంట్రాక్ట్ ఉద్యోగికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా చేసే 11 కేవీ విద్యుత్ లైన్ ముత్తారం శివారులోని గుల్లకుంట వద్ద తెగిపోయింది. సమాచారం అందుకున్న సిబ్బంది సోమవారం అక్కడికి వెళ్లి, మరమ్మతు చేస్తుండగా కాల్వశ్రీరాంపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే విద్యుత్ తీగ రాపెల్లి నాగరాజుకు తగలడంతో విద్యుదాఘాతం సంభవించింది. ఈ ఘటనలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. సబ్‌స్టేషన్‌లో ఫీజు కొట్టివేయడంతో ప్రాణాపాయం తప్పింది. తోటి సిబ్బంది నాగరాజును కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

బొగ్గుబాయి వార్తలు

ఉత్పత్తి లక్ష్యాలను రక్షణతో సాధించాలి


మ్యాప్ పరిశీలిస్తున్న డైరెక్టర్ శ్రీనివాస్

రామగిరి(మంథని): సింగరేణి యాజమాన్యం నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను రక్షణతో సాధించాలని డైరెక్టర్ (ఆపరేషన్స్)ఎన్‌వీకే.శ్రీనివాస్ సూచించారు. సింగరేణి సంస్థ ఏపీఏ పరిధిలోని అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్(ఏఎల్పీ)ను సోమవారం సందర్శించారు. ముందుగా గని అధికారులతో రక్షణ, ఉత్పత్తిపై చర్చించారు. గని లోపలికి వెళ్లి పనిస్థలాలు, యంత్రాల పనితీరును పరిశీలించారు. గనిలోని సమస్యలు, ఉత్పత్తి, రవాణాపై జీఎం వెంకటేశ్వర్లు డైరెక్టర్‌కు వివరించారు. ఏరియా ఇంజినీర్ సీతా రామం, ప్రాజెక్ట్ అధికారులు మత్స్యగిరి నరేందర్, కొలిపాక నాగేశ్వరరావు, ప్రాజెక్ట్ ఇంజినీర్ టి.రఘురామ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలపై దృష్టి పెట్టండి

- ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్


గని మ్యాప్ పరిశీలిస్తున్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): ఉత్పత్తి లక్ష్యాల గడువు దగ్గర పడుతున్న నేపథ్యంలో గని వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలపై దృష్టి పెట్టాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ సూచించారు. సోమవారం వకీల్‌పల్లి గనిని ఆయన సందర్శించి, లక్ష్యాలపై దిశానిర్దేశం చేశారు. అలాగే ఉత్పత్తికి సంబంధించిన పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. రక్షణ చర్యలను పాటిస్తూ గడువులోపే బొగ్గు ఉత్పత్తి సాధించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు. జీఎం వెంట గని ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ రవికిరణ్, సర్వే అధికారి అప్సర్‌పాషా, గ్రూప్ ఇంజినీర్ చంద్రశేఖర్, సంక్షేమాధికారి ఓంకారి బాబు తదితరులున్నారు.

ఐఎఫ్‌టీయూ మహాసభలకు రండి

రామగిరి(మంథని): ఈ నెల 18, 19 తేదీల్లో పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ఐఎఫ్‌టీయూ మహాసభలకు తరలిరావాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న కోరారు. సోమవారం సింగరేణి ఆర్జీ–3 పరిధి ఏరియాలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. సంస్థలో గత రెండు దశాబ్దాలుగా కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు, హక్కులు, సౌకర్యాలు, సీఎంపీఎఫ్, వైద్య సౌకర్యం, బ్యాంకు వేతనాలు, ఉద్యోగ భద్రత, బోనస్ తదితర హక్కుల సాధనలో ముందుండి పోరాటాలు నిర్వహించిన చరిత్ర ఐఎఫ్‌టీయూకు ఉందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడం కోసం, కార్మిక వర్గాన్ని చైతన్యం చేయడం కోసం, ఒక బలమైన నాయకత్వాన్ని ఎన్నుకోవడం కోసం ఈ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరూ హాజరై, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు జి.నరసయ్య, సత్తి, పెద్ద రాజయ్య, మధునయ్య, మొండయ్య, చొక్కారావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడారత్న, కళారత్న అవార్డులు అందజేత


అవార్డులు అందిస్తున్న రాధాకృష్ణ

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): యైటింక్లయిన్ కాలనీకి చెందిన ప్రముఖ క్రీడాకారుడు కొత్తకొండ శ్రీనివాస్‌కు జాతీయ క్రీడారత్న, షార్ట్ ఫిలిమ్స్ మేకర్, డ్యాన్సర్ ఎలబోతారం సారయ్యకు జాతీయ కళారత్న అవార్డులను బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ అందజేశారు. ఆదివారం రాత్రి తిరుపతిలో నిర్వహించిన సాహిత్య అకాడమీ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌లో పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎం.గౌతమ్, కో–ఆర్డినేటర్ విష్ణు, అవార్డు సెలక్షన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సివిల్ పనుల్లో భద్రతా చర్యలు పాటించాలి


మాట్లాడుతున్న జీఎం వెంకటేశ్వర్‌రావు

- ఆర్జీ–3 జీఎం వెంకటేశ్వర్‌రావు

రామగిరి(మంథని): సివిల్ పనులు చేసేటప్పుడు విధిగా భద్రతా చర్యలు పాటించాలని ఆర్జీ–3 జీఎం తన్నీరు వెంకటేశ్వర్‌రావు అన్నారు. సెంటనరీకాలనీలోని సివిల్ డిస్ట్రిబ్యూషన్ పాయింట్ వద్ద సోమవారం సివిల్ విభాగం భద్రతా వారోత్సవాలను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. సింగరేణిలో మంగళవారం నుంచి ఈ నెల 21 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బొగ్గు ఉత్పత్తి జరిగే చోటుతో పోలిస్తే ఇతర పని ప్రదేశాల్లో ప్రమాదాలు పెరిగినట్లు పేర్కొన్నారు. సివిల్ కార్మికులు ఎత్తైన షెడ్లపై, చెట్లు ఎక్కి పని చేసేటప్పుడు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువని, అలాంటప్పుడు సూపర్‌వైజర్లు సూచించిన రక్షణ సూత్రాలను తప్పకుండా పాటించాలని సూచించారు. వారోత్సవాల కరపత్రాలు ఆవిష్కరించారు. టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ గౌతం శంకరయ్య, ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతి, ఏరియా రక్షణ అధికారి సీహెచ్.వెంకటరమణ, పర్సనల్ డీజీఎం విలాస్ శ్రీనివాస్ పోద్దార్, సివిల్ ఎస్ఈ పద్మరాజు, సీనియర్ సెక్యూరిటీ అధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఇక ఆన్‌లైన్‌లో కార్మికుల వైద్య వివరాలు


సమావేశంలో పాల్గొన్న అధికారులు

గోదావరిఖని(రామగుండం): ఇక నుంచి కార్మికులు, వారి కుటుంబసభ్యుల వైద్య వివరాలు శాప్ ద్వారా ఆన్‌లైన్ చేసేందుకు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఆసుపత్రి మేనేజ్‌మెంట్ సిస్టం, సీపీఆర్ఎంఎస్‌పై సోమవారం జీఎం కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. శాప్‌లో అప్‌డేట్ చేసి, సంస్థ వ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల వ్యాధులు, రిఫరల్ వివరాలు, ఫిట్, అన్‌ఫిట్ సమాచారం, ప్రస్తుతం రోగి పరిస్థితి, అతనికి అందుతున్న వైద్యం తదితర వివరాలను శాప్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. సీపీఆర్ఎంఎస్ మెడికల్ కార్డు ఉపయోగించుకొని, సింగరేణి హాస్పిటల్‌లో మెడికల్ ట్రీట్‌మెంట్‌కు సంబంధించి వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సేఫ్టీ జీఎం సాంబయ్య, ఐటీ డీజీఎం హరిశంకర్, సేఫ్టీ అధికారి బండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల–వరంగల్ రహదారికి అడ్డంకులు

- భూసేకరణ ఆపాలంటూ హైకోర్టును ఆశ్రయించిన రైతులు
- ఖాళీ చేయించొద్దని న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు
- అవార్డు పాస్ చేసేందుకు అధికారుల కసరత్తు

మంథని: నాగ్‌పూర్–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేలో భాగంగా మంచిర్యాల–వరంగల్ మధ్య జాతీయ రహదారి నిర్మాణానికి అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఈ రోడ్డు కింద భూములు కోల్పోతున్న రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా భూసేకరణ ఆపాలంటూ ఆయా జిల్లాలకు చెందిన అన్నదాతలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు రైతులకు సంబంధించిన భూములను ఖాళీ చేయించవద్దని న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు కాపీలను పలువురు కర్షకులు ఆయా జిల్లా ఆర్డీవోలకు సైతం అందించారు.

భూములు ఇచ్చేదిలేదంటున్న రైతులు

జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూమిని సేకరించే పనిలో భాగంగా అధికారులు న్యాయస్థానం పరిధిలో ఉన్న భూములను మినహాయించి మిగతా వాటికి అవార్డు పాస్ చేసే ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామాల్లో రెవెన్యూ అధికారులు ఎంజాయ్‌మెంట్ సర్వే చేసి, పెగ్ మార్క్ చేశారు. ఈ క్రమంలో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేక ఎదురైంది. అధికారులు గ్రామసభలు నిర్వహించి, సర్ది చెప్పారు. భూసేకరణకు సంబంధించి తదుపరి చర్యలు తీసుకుంటున్నారు. కానీ రైతులు మాత్రం ఎట్టిపరిస్థితుల్లో తమ పచ్చని పంట పొలాలను ఇచ్చేది లేదంటున్నారు.

జిల్లాలో 199.7358 హెక్టార్లు అవసరం

పెద్దపల్లి జిల్లాలోని మంథని డివిజన్ పరిధిలో సుమారు 40 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి ప్రతిపాదించారు. మంథని, ముత్తారం, రామగిరి మండలాల పరిధిలో 16 గ్రామాల్లో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. 199.7358 హెక్టార్ల భూమి అవసరమని గుర్తించారు. గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ రోడ్డు కావడంతో ఎక్కడ పడితే అక్కడ ఇతర రోడ్ల మీదుగా వచ్చే వాహనాలు ఈ రోడ్డు మీదుగా వెళ్లే వీలుండదు. దీనికోసం కొన్ని ముఖ్య పట్టణాల ప్రాంతాల్లో ఇంటర్ చేంజ్ అండర్‌పాస్‌లు కోసం మరింత భూ సేకరణకు కసరత్తు చేస్తున్నారు. రైతులకు ఏ మేరకు పరిహారం చెల్లించాలనే అంశంపై కసరత్తు జరుగుతున్నట్లు తెలిసింది.

మొదటి ప్యాకేజీలో 31 కిలోమీటర్లు

కొత్తగా నిర్మించే జాతీయ రహదారికి 2021 ఫిబ్రవరి 3న గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. గ్రీన్‌ఫీల్డ్ హైవే తరహాలో పట్టణాలు, జనవాసాలకు దూరంగా మైదాన ప్రాంతాల గుండా సాగే జాతీయ రహదారిని నాగ్‌పూర్ నుంచి విజయవాడకు నిర్మించనున్నారు. మంచిర్యాల సమీపంలోని నార్వ నుంచి మంథని మండలం పుట్టపాక వరకు 31 కిలోమీటర్లు మొదటి విడతలో తీసుకోనున్నారు. మొత్తం 108 కిలోమీటర్ల రహదారికి రూ.2,607 కోట్లు కేటాయించనున్నారు. రహదారి నిర్మాణానికి టెండర్లు సైతం కోరారు.

భూ సేకరణ కొనసాగుతోంది..

గ్రీన్‌ఫీల్డ్ హైవేకు నిర్దేశించిన భూ సేకరణ ప్రక్రియ కొనసాగుతోంది. కొంతమంది రైతులు న్యాయస్థానాలను ఆశ్రయించిన భూమి మినహాయించి మిగతా భూమిని సేకరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. అవార్డు పాస్ చేసే ప్రక్రియ పురోగతిలో ఉంది.
– వీరబ్రహ్మచారి, ఆర్డీవో, మంథని